క్లుప్తంగా

యంత్రాలకు పగుళ్లతో పెను ప్రమాదాలు

కొమ్మాది: యంత్రాల్లో కనిపించే చిన్నపాటి పగుళ్లు పెను ప్రమాదానికి సంకేతమని, వాటిని ప్రారంభంలోనే గుర్తించి సరి చేయాలని ఐఐటీ గౌహతి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కేఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. గీతం వర్సిటీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యంత్రాలు, వాటి విడి భాగాలు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు చీలికలు ఏర్పడతాయన్నారు. అణువిద్యుత్ కేంద్రాలు, రైలు పట్టాలు, భారీ నౌకలు, వంతెనలు, గ్యాస్ సరఫరా పైప్ లైన్లు, విమానాల్లో ఏర్పడే పగుళ్లు పెను ప్రమాదాలకు దారి తీసిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. వీటిని ముందుగానే గుర్తిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్టా రవి తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం సబ్బివీధి, సంగివలస కాలనీ, ఊళ్లపేట, నమ్మివానిపేట, ఇడదాసరిపేట, చిల్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

స్టడీ మెటీరియల్ సద్వినియెగం చేసుకోవాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు, తదితరులు

పద్మనాభం: స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మరగడ అప్పారావు సమకూర్చిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 62 మంది విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఇప్పటి నుంచే చదివితే మంచి మార్కులు సాధిస్తారన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు భవిష్యత్‌లో కీలకమన్నారు. కార్యక్రమంలో స్టడీ మెటీరియల్ దాత మరగడ అప్పారావు, హెచ్ఎం విజినిగిరి శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుడు ఆత్మహత్యాయత్నం

మధురవాడ: జీవీఎంసీ పారిశుధ్య కార్మికుడు శరీరంపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే... కొద్ది రోజులుగా జీవీఎంసీ కార్మికులు చేస్తునన సమ్మె కారణంగా మధురవాడలో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గురువారం ఉదయం జీవీఎంసీ మధురవాడ జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో కిషోర్ వేరే కార్మికులతో చెత్త తొలగించే పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న యజ్జల చిన్న అనే కార్మికుడు నిరసన తెలిపేందుకు శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సహచర కార్మికులు తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి డిశ్చార్జి చేశారు.

7న ఉచిత ఆయుర్వేద శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 7న బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పైల్స్, ఫిస్టుల తదితర సమస్యలపై చికిత్స అందించనున్నట్టు పేర్కొన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారన్నారు. రోగులు తమ వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు తీసుకుని రావాలని సూచించారు. ఇతర వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలన్నారు.

లబ్ధిదారుల చెంతకే సంక్షేమ పథకాలు

- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పింఛన్ నగదు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తాళ్లవలసలో వైఎస్సార్ పింఛన్ కానుక నమూనా చెక్కు అందిస్తున్న శ్రీనివాసరావు

తగరపువలస: టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీలు, ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి చేతులు కట్టుకుని, తలవంచుకుని నిలబడాల్సి వచ్చేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులే నేరుగా లబ్ధిదారుల ఇంటికి వచ్చి గౌరవంగా పథకాల లబ్ధిని అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భీమిలి మండలం తాళ్లవలసలో గురువారం 16 పంచాయతీలకు సంబంధించి 13 గ్రామ సచివాలయాల లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వినియోగించుకునేవారన్నారు. పవన్ కూడా కొన్ని వర్గాలను అదేవిధంగా వినియోగించుకుంటున్నారన్నారు. వీరిద్దరూ మాటలు చేప్పే నాయకులు మాత్రమేనన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే విశాఖలో యాదవులకు ఏఎంసీ చైర్మన్, జీవీఎంసీ మేయర్, వీఎంఆర్డీఏ చైర్మన్, ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో మాత్రమే ప్రతీ నెల సామాజిక పింఛన్ల కోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ అయిదున్నరేళ్లలో 68 లక్షల మంది పెన్షనర్ల కోసం రూ.84 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. విశాఖ రాజధాని అయితే కీలకమైన భీమిలికే ఎక్కువగా ప్రాధాన్యత కలుగుతుందన్నారు. సమావేశంలో భీమిలి ఎంపీడీవో డాక్టర్ జానకి, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్ బోనిల జగ్గమ్మ, సన్నిబాబు, ఉప సర్పంచ్ బీఎస్ఎన్ రాజు, చిల్ల హరి, అక్కరమాని అప్పలరాయుడు, దంతులూరి వేణు, చిన్ని రాజు, గొలగాని సన్యాసిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మజ్జి సూరినాయుడు, చెల్లూరి పైడపప్పడు, ముద్దాడ అప్పయ్యమ్మ, గాడు వెంకటనారాయణ, చెల్లూరి నగేష్, లచ్చుబుగత జగదీశ్వరరావు, కాద సూర్యనారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, మద్దిల వెంకటరమణ, కొల్లి రామకృష్ణారెడ్డి, కొల్లి కోటిరెడ్డి, కె.ఎ.ఎ స్.ఎన్.రెడ్డి, అక్కరమాని రామునాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు, తుపాకుల అప్పలరాజు, పల్లా సన్యాసిరావు, వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, తోట ఎల్లారావు, పూసర్ల ఎర్రయ్య తదతరులు పాల్గొన్నారు.

కొమ్మాది: ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం వంద శాతం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మాట తప్పని, మడమ తిప్పని పాలన అంటే ఇదేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూపించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం సచివాలయం – 2లో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛను నగదు రూ.3 వేలకు పెంచడంతో ఎందరో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారని కొనియాడారు. తల్లిదండ్రులనే చూడని పిల్లలున్న ఈ కాలంలో పెద్ద కొడుకై, పెద్ద మనసుతో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. 4వ వార్డులో నెలకు రూ.2.6 కోట్లు పింఛనుదారులకు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 4వ వార్డుకు సంబంధించి పలు ప్రాంతాల్లో రూ.1.26 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జెడ్సీ బొడ్డేపల్లి రాము, వివిధ విభాగాల అధ్యక్షులు, డైరెక్టర్లు బాడిదబోయిన రాములప్పడు, బోర రామకృష్ణ, దూడ అచ్చారావు, వాసుపల్లి నల్లబాబు, మేరుగు చిన్నారావు, నాగోతు సింగన్న, కోడిబోయిన రమణ, కోడిబోయిన వరహాలు, దేవాడ నాయుడు, సాడి రమణ, వేముల ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసరావు, మరుపిల్లి చిన్నారావు, ఏఈ సుమన్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెదడుకు సానపెడితే అద్భుత ఫలితాలు



అనంతవరం హైస్కూల్ విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : విద్యార్థులు మెదడుకు సానపెడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఐఎఫ్‌బీ ఫ్యానల్ బోర్డులు, నాడు – నేడు నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు 40 మందికి ట్యాబులు, ఎస్ఎంసీ సమకూర్చిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను 38 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ట్యాబులు సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని మరింత మెరుగుపరచుకోవాలన్నారు. ప్రభుత్వం నాడు – నేడు ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా ఆధునికీకరించిందన్నారు. డీసీఈ బోర్డు సెక్రటరీ ఎంవీ కృష్ణ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు గేదెల చంద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ కళిరెడ్డి వెంకట సత్యం పాల్గొన్నారు.

జ్ఞాన కవాటాలు ప్రసాదించిన మహనీయుడు లూయిస్



బ్రెయిలీ చరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస : ప్రపంచంలోని అంధులకు జ్ఞాన కవాటాలు ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆయన చరిత్ర వివరించారు. అంధులు కంటితో చూడలేరు కాబట్టి స్పర్శతో ఎత్తుగా ఉబ్బి ఉండే అక్షరాలు కలిగిన బ్రెయిలీ లిపిని పరిశోధన ద్వారా తయారు చేశారన్నారు. ఆ లిపి ఆయన మరణానంతరమే అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు పిన్నింటి నాగమణి, నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



పులిహోర ప్రసాదంతో ఏడు కొండలు నమూనా



వేంకటేశ్వర స్వామికి పూజ చేస్తున్న అర్చకులు

మధురవాడ: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. 127 కేజీల అన్నం ఏడుకొండలు ఆకారంలో రాశులుగా పోసి అలిపిరి నుంచి తిరుమలకు దారి చూపించే నమూనా ఏర్పాటు చేశారు. వివిధ రకాల పండ్లు, కాయగూరలు, పువ్వులు, ఇతర వంటకాలతో అలంకరించారు. అర్చకులు పీసపాటి నరసింహాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి సంప్రదాయ వంటకాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. సుమారు 2 వేల మంది భక్తులకు అన్నం, ఇతర ప్రసాదాలు పంపిణీ చేశారు. విష్ణు సహస్రనామ సంకీర్తనలు, గోవిందనామ స్మరణతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు



సంగివలస - పాండ్రంగి రహదారిని ఆనుకుని నిర్మించిన దుకాణాలు

తగరపువలస: భీమిలి జోన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది పనితీరు తరచూ వివాదాస్పదమవుతోంది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సిబ్బంది స్పందిస్తున్నా జోనల్ అధికారులు మాత్రం నిద్ర నటిస్తున్నారు. రెండో వార్డు పరిధిలోని సంగివలస – పాండ్రంగి రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 90లో 391.8 చదరపు గజాల స్థలం కలిగిన యజమాని అంగుళం స్థలం కూడా విడవకుండా ఇటీవల మూడు దుకాణాలు నిర్మించి అద్దెకు ఇచ్చుకున్నారు. ఇప్పుడు పక్కనే ఉన్న రహదారిపై ఆయన కన్ను పడింది. అనుకున్నదే తడవుగా స్థానికులు అభ్యంతరాలు తెలిపినా ఖాతరు చేయకుండా మూడు రోజుల్లో రెండు దుకాణాలు నిర్మించాడు. సంగివలస – పాండ్రంగి రహదారిపై ఇటుక బట్టీలు ఎక్కువగా ఉన్నందున ఇటుకలతోపాటు, వాటి తయారీకి వినియోగించే మెటీరియల్‌తో నిత్యం భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. కార్నర్‌లో రోడ్డును ఆనుకుని నిర్మించిన దుకాణాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున స్థానికులు భీమిలి టౌన్ ప్లానింగ్, స్థానిక సచివాలయ సిబ్బంది ముందు ఆందోళన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ ఆక్రమణదారునికి వత్తాసు పలుకుతూ తమకు పట్టనట్టు సిబ్బంది ఊరుకున్నారు. దీంతో ఈ నెల 8న జీవీఎంసీ కార్యాలయంతోపాటు కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేయడానికి స్థానికులు సమాయత్తం అవుతున్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వృద్ధురాలికి మెడికల్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బింద్రానగర్‌లో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బింద్రానగర్ వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న సిబ్బంది

కొమ్మాది: దేశ చరిత్రలోనే ఇంటి ముంగిటకు వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డబ్బులు లేక పేదవారికి వైద్యం దూరం కాకూడదన్న ఆలోచన నుంచి వచ్చిందే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం అని, అలా ఆలోచించే ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమన్నారు. గతంలో అనారోగ్యానికి గురైతే దూరంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికో, కేజీహెచ్‌కో వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం వైద్యం అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక నిర్ణయం తీసుకుని శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ పరీక్షలు నిర్వహించి మందులు అంజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నాయకులు జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, బోయి సూరెడ్డి, మన్యాల సోంబాబు, బోయి శ్రీను, పరదేశి, సన్ని, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ మాటలు నమ్మొద్దు

మధురవాడ: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌వి సొల్లు కబుర్లు మాత్రమేనని, వారిని ఎవ్వరూ నమ్మవద్దని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌లో గురువారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ ఆచరణ సాధ్యమైన మాటలు ఎప్పుడూ చెప్పరన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకుని, వారికి మంచి చేసే రియల్ హీరో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని చెప్పారు. గత టీడీపీ హయాంలో 1,054 జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తే... ఇప్పుడు 3,257 రోగాలకు చికిత్స పొందే అవకాశం జగనన్న కల్పించారన్నారు. గతంలో 758 ఆస్పత్రుల్లోనే ఈ సేవలు అందుబాటులో ఉంటే, ప్రస్తుతం 2,513 హాస్పిటల్స్‌లో ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో రూ.5 లక్షలు మాత్రమే ఉన్న పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఇటువంటి ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, మెడికల్ ఆఫీసర్లు కె.షలోమి, ప్రశాంతి, జీవీఎంసీ ఏఈ శ్రీధర్, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు లొడగల రామ్మోహన్, చెన్నా దాసు, పిళ్లా సూరిబాబు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, మన్యాల సోంబాబు, ఎంవీ రమణమూర్తి, రాజు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ప్రసాద్, ఈటీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


ఉచితంగా కళ్లద్దాలు అందించారు



గత కొన్నాళ్లుగా కంటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. ఆస్పత్రికి వెళ్దామనుకుంటే డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నా. వలంటీర్ ద్వారా ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలుసుకుని వచ్చి పరీక్షలు చేయించుకున్నా. వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులతోపాటు కళ్లద్దాలు అందజేశారు.

– నొడగల రామయ్యమ్మ, మారికవలస.

చాలా మంచి ఆలోచన



గతంలో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. చాలా డబ్బు ఖర్చు చేసుకునే వారిమి. ప్రస్తుతం 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు నిర్వహించి, నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందించడం చాలా గొప్ప విషయం. ఇలాంటి ప్రజా సంక్షేమ పాలన నేనెప్పుడూ చూడలేదు.

– గంటిబోయిన పరదేశి, మారికవలస.

ప్రతిభకు తార్కాణాలు వైజ్ఞానిక ప్రదర్శనలు



నమూనాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

ఆనందపురం : వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిలుస్తాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు అన్నారు. మండలంలోని గిడిజాలలో గల సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పాలిఫెస్ట్ 2కే 24ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. కొత్త ఆవిష్కరణలు చేపట్టడానికి ఆధునిక సాంకేతిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. అవకాశాలు అందిపుచ్చుకుని పరిశోధనలు చేసి సమాజానికి ఉపయోగపడే కొత్త అంశాలు రూపొందించాలని కోరారు. వారం రోజులపాటు సాగే ఫెస్ట్‌లో మొదటి రోజు విద్యార్థులు రూపొందించిన 180 నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, విభాగాధిపతులు సత్యవతి, రాజేంద్ర, స్వరూప, అరుణ, సోమేశ్వరరావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం



రేఖవానిపాలెంలో మాట్లాడుతున్న కంటుభుక్త రామానాయుడు

తగరపువలస: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ భీమిలి నాయకులు మండలంలోని మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు విజయ కుమారి, దుర్గాదేవి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. పీఎం జీవన్‌జ్యోతి ద్వారా ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల వరకు బీమా ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, 3వ వార్డు అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పోలుబోతు విజయ, మండల ప్రధాన కార్యదర్శి రేక కరుణారావు, సీడ్ కౌన్సిలర్ శ్రీకాళి, హెల్త్ సూపర్‌వైజర్ చక్రవర్తి, హెచ్‌పీ గ్యాస్ కో ఆర్డినేటర్ ఎం.రాజు, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించి విశేష హారతి అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టంతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.